# 2. పువ్వులు

దాదాపు అయిదేళ్ళ తర్వాత అనుకుంటాను రేణుక కనిపించింది నాకు. పలుకరించుదామా వద్దా అని క్షణం ఆలోచించి వద్దనే నిర్ణయించుకొన్నాను. నాకపుడు రేణుక ఏమవుతుందని పలకరించాలి? కానీ నేను మానవుణ్ణి—నేను నా అంతట రేణుకను పలకరించ కూడదనే అనుకున్నాగానీ రేణుకే నన్ను పలుకరిస్తుందనుకోలేదు.

'బావా!—' రేణుకే పిలిచింది.

వినీ విననట్లు కదిలాను....'బావా—'

పలకక తప్పదు. పలికాను-'నువ్వా?—' పలికరింతలో ఎంతో ఆప్యాయత, అనురాగం ప్రవహిస్తున్నా, అదంతా బూటకం. ఆ మాటలు నా నాలుక చివరినుంచే వచ్చాయన్న సంగతి నిజం.

'ఆ. నేనే! బాగున్నావా?—'

ఈ ప్రశ్న రేణుక అడగాల్సింది కాదు! అయినా అడిగింది, అడగగలిగింది అంటే కారణం రేణుక ఆడది! అంతే భగవంతుడు ఈ ఆడవాళ్ళకు గతాన్ని ఇంత తొందరలో మరిచిపోగలిగే వరాన్ని ఎందుకిచ్చాడు? వీళ్లు ఆ వరాన్ని ఇంత దారుణంగా ఉపయోగించుకుంటే ఎలా?

గతం వాళ్ళకొక పీడకల—తెల్లవారి లేవగానే మొఖం కడుక్కొన్నట్లుగనే, రోజూ గడవగనే ఆ రోజుకు సమాధి కట్టకలిగే స్థోమత, మరునాటికి స్వాగతం చెప్పగలిగే ధైర్యం ఎక్కడనుంచి వస్తోంది వీళ్ళకు?

బహుశా భగవంతుడుకూడ సమాధానం చెప్పలేడనుకుంటాను.

'జవాబు చెప్పవేం---?' అనడగింది రేణుక నవ్వుతూ.

ఆలోచనలు హఠాత్తుగ ఆగిపోయాయి. ఏమడిగింది? అదే అడి గాను---చెప్పింది. రేణుక ఉత్త ఫూల్. రేణుకే గాదు, అసలు తెలుగు వాళ్ళంతా ఫూల్స్. లేకపోతే ఎదురుగ మనిషిని పెట్టుకొని 'బాగున్నావా?' అని ప్రశ్నించే జాతిని ఇంకేమనాలి?

అయినా ఈ ప్రశ్న ఈవేళ అడగాల్సిందా?

ఏ రోజు ఈ ప్రశ్న అడగాలో, ఆ రోజు....ఆ తర్వాత కూడా నన్ను తప్పించుకొనే తిరిగింది రేణుక. ఈ రోజు, ఇలా---రోడ్డుమీద అడిగే ప్రశ్నేనా ఇది? దీనికి నా నుంచి సమాధానం ఆశిస్తోందా ఈ రేణుక?

కాదు, రేణుక కాదు ఫూల్. నేను!!

మనసిచ్చిందని నమ్మి, నా మనసును తనకిచ్చి మోసపోయిన నేను ఫూల్ను---ఆడదాన్ని నమ్మినందుకు నేనే ఫూల్ను. నిజం!

ఈ రోజు గుర్తొస్తోంది---రేణుకకు పూలంటే ఇష్టం. మల్లెలంటే మరీను. ఈ సంగతి నాకేం తెలీనిది గాదు. అయినా అదెందుకోగానీ పూలు మాత్రం ఇంటికి తీసుకెళ్ళలేక పోతున్నాను. వరుసగ రెండు రోజులనుంచీ అడుగుతోంది రేణుక---'తెచ్చావా బావా?---' అని.

రెండు రోజుల ప్రశ్నకూ ఒక్కటే సమాధానం 'సారీ, మర్చి పోయా---'

రెండు రోజులూ నవ్వింది రేణుక 'నువ్వింత ఇదిగ ఉంటే ఎలా బావా?---' ఆ ఇది ఏమిటో నాకూ తెలీలేదు.

ఆవేళ అయినా పూలు తీసుకెడదామనుకున్నాగానీ యథాప్రకా రంగా మర్చిపోయాను. నిజానికి నేను మర్చిపోలేదు. మర్చిపోను.

పూలషాపు దగ్గరకెళ్ళి పూలు కొనాలంటే నాకెందుకో ఇష్టం ఉండదు ప్రక్కనే రేణుక ఉంటే సరేసరి. లేకపోతే వాళ్ళు నా గురించి ఏమో అనుకుంటారు. అదేం బాగుండదు నాకు!

ఇంటికి వెళ్ళేసరికి రేణుకే ఎదురొచ్చింది—'పూలు…నువ్వు ఈ వేళా మర్చిపోయావు, బావా?—'

బావనలేదు, కాదనలేదు.

'నిన్ను కట్టుకొని నేనేం సుఖపడతా బాబూ?—' ఇది స్వగతంగా అందో, ఎలా అందోగానీ నా కెంతో ఆనందం కలిగింది.

చాలా సేపు తర్వాత అంది రేణుక—'బావా! దొడ్లో గులాబిపువ్వు పూసింది—'

'అది రోజూ పూస్తూనే ఉంది' అన్నాను నేను అనుకోకుండా. క్షణం తర్వాత అనిపించింది ఎంత తెలివితక్కువవాణ్ణి! దొడ్లో రోజూ పూస్తున్నంత మాత్రాన అవి పూలు కాకపోతాయా? రేణుక కోరిక తీరక పోతుందా ?

—పెరటిచెట్టు సామెత ఇక్కడ పనికిరాకూడదు!!

వెళ్ళి దొడ్లో చూశాను—గులాబిచెట్టు బోసిగ ఉంది. రేణుకను పిలిచాను—'పువ్వేదీ?'

'అరె, లేదా? కాకెత్తుకపోయి ఉంటుంది' నవ్వుతూ అంది రేణుక. 'ఏడిశావ్' అని ఏదో అనబోతుంటే అంది రేణుక-'శారద తీసుకెళ్ళింది'

ఛీ! ఈ శారద ఒకత్తి నా ప్రాణానికి. శారద రేణుక స్నేహితురాలు. ఎదురిల్లు. ఎప్పుడు బడితే అప్పుడు రావడం, నాకూ రేణుకకూ, ఆ అందమైన క్షణాలు లేకుండా చేసే ఆడ విలన్ ఈ శారద. ఎప్పుడో ఒకప్పుడు... ఆ మాటే అన్నాను రేణుకతో.

నవ్వేసింది రేణుక–'జాగ్రత్త బావా! నాకోసం వస్తోందని కోపం కొద్దీ దగ్గరకెళ్ళేవు–రంగేసి పంపిస్తుంది. ఆ తర్వాత, అసలే అలా ఉంటావు, నల్ల రంగులో, బాబోయ్, నే చూడలేను నే భరించలేను... '

శారద నలుపురంగు నా కంటుకొంటుందని రేణుక భయం. మాట వరసకు అంటేనే ఇంత భయపడితే ఎలా? అయినా రేణుక ఆడది. ఆడదంటే అసూయ అని ఊరికే అన్నారా?

'తర్వాత ఆలోచిద్దువుగానీ బావా! ఇదిగో ఇదీ మా అడ్రసు! తప్ప కుండా రావాలి!' అంది రేణుక నా ఆలోచనలను ఆపుచేస్తూ.

ఆ కాగితం అందుకొన్నాను—రేణుక రెండడుగులు ముందుకేసి, తిరిగి వచ్చింది 'తప్పకుండా రా బావా! నీ కెన్నో విషయాలు చెప్పాలి. ప్లీజ్....' అంది బ్రతిమలాడుతున్నట్లు.

ఇదంతా బూటకం. ఈ రేణుక సంగతి నాకు తెలీనిది గాదు. పుట్టినప్పటినుంచీ కలిసి మెలసి బ్రతికాము. ఆ మనసును నాకన్నా ఇంకెవరూ బాగా చదవలేరు.

చేతిలో కాగితం తీసుకొని చదివాను 'రూం. నెంబరు 22, వెంక టేశ్వరా లాడ్జి'

ఆశ్చర్యపోయాను. ఆసక్తి కలిగింది, ఆత్రుతా పెరిగింది. ఈ వూళ్లో ఉండీ, లాడ్జిలో ఉండే అవసరం రేణుకకు ఎందుకు కలిగింది?

తప్పదు—వెళ్ళాలి—అంతా తెలుసుకోవాలి.

కానీ, మనసు మొరాయిస్తోంది రేణుకను చూడాలంటే.

నిజమే—ఈ రేణుకనే చూడాలి, చూడాలి అని తపించిపోయిన రోజులెన్నో ఉన్నాయి నా జీవితంలో. ఆ రోజులన్నిటికి మసిబూసి, సమాధి చేసుకొని మనసును చంపుకొన్న ఆ కాలానికి ఈ వేళ చరమ గీతం పాడాలంటే అంత తేలికగా అంగీకరించటం లేదీ మనసు. ఎంతగా

రేణుకను చూడాలని తపించానో, అంతగానే ఈ రోజు ద్వేషించగలుగుతున్నానేమో!

అయినా తప్పదు—రేణుకను కలుసుకు తీరాలి.

అసలేం జరిగిందో ఆ రోజున మనసు పూర్తిగా చచ్చిపోయిన రోజున ఈ 'నా ప్రాణం' ఎందుకింత నిర్లిప్తంగ ఉండి పోయిందో తెలుసుకుతీరాలి.

వెళ్ళాను సాయంత్రం నాలుగింటికి. నాలుగింటికి వెళ్ళటంలో కారణం లేకపోలేదు, రేణుక భర్తను చూడటం ఇష్టంలేక. వెళ్ళేసరికి తలుపుకు తాళంవేసి ఉంది. హోటల్ బాయ్‌ను అడిగాను.

'హాస్పిటల్‌కు వెళ్ళారు సార్!'

"హాస్పిటల్‌కా ? ఎందుకు??"

'రోజూ వెళ్తున్నారు సార్'

రోజూనా ? అయినా మొదటి ప్రశ్న ప్రశ్నలాగే ఉండిపోయింది.

'ఎన్నాళ్ళనుంచీ ఉంటున్నారిక్కడ ?'

'ఇరవై రోజులయిందేమో!'

సర్‌ప్రైజు—సర్‌ప్రైజు ! అంతా ఆశ్చర్యంగా ఉంది. ఏమిటిదంతా?

జీవితం హోటల్లో ! జీవిస్తున్నది హాస్పిటల్లో!! జీవనం ఇరవై రోజులనుంచి!!

కథంతా అల్లకల్లోలంగ ఉంది.

అక్కడే కూర్చున్నాను—రేణుక వస్తుందనే ఆశతో.

మెల్లిగ ఏడింటికి వచ్చింది—పొద్దున్న చూసిన రేణుకకూ ఈ రేణుకకూ హస్తిమశకాంతరం ఉంది. మనసుకూడ ఊసరవెల్లి అని ఈ క్షణంలో అర్థమయింది.

రకంగా పరిణమిస్తోందీవిడతో ఈ కథ. అయినా అసలెందుకు రమ్మంది?
'ఎన్నో చెప్పాలిట'

అడిగాను.

'ఓ, అదా? అలా అంటేగానీ రావేమోనని!'

ఇంకేం మాట్లాడను? అబద్ధాల వలవేయటం చేతనైన ఆడది ఎదురుగ ఉంది. నేనేం మాట్లాడినా నేనే ఓడిపోతాను–రేణుక చేతిలో ఓడిపోవటం ఇష్టమే–కానీ ఇలా కాదు, ఈ రేణుక చేతిలోనూ కాదు!

ఈ రేణుక రంగులు మార్చగలిగే ఊసరవెల్లి!

నా రేణుక ఒకే రంగుతో విలసిల్లే ముద్దబంతి!! నా రేణుకలో ఇంత కల్మషం లేదు. అబద్ధాల వల పన్ని ఆటలాడించగలిగే ఆడపిల్ల కాదు, పంతంలో ఉన్నా, నిర్మలంగ నవ్వగలిగే కలువపువ్వు నా రేణుక!!

మనసెంతో మథనపడుతోంది–వెళ్తానని అన్నాను రేణుకతో.

'అదేమిటి బావా! ఇలా వచ్చి అలా వెళ్తాననట మేమిటి?'

ఏం చేయాలో చెప్పు మరి'?

రేణుక నాకేసి అదోలా చూసింది. 'అంతేలే బావా! తమ తమ నెలవులు తప్పిన తమ వారలె శత్రువులౌదురన్నట్లు, ఇన్నాళ్లకి నాతో మాట్లాడటానికి నీకు మాటలే కరువయ్యాయి.'

'అలా అని కాదు...'

'ఇంకెలా అనాలి? అపుడు.... నేను బతికిన రోజుల్లో, పొగడచెట్టు కింద పగలు, రేయి కబుర్లు చెప్పుకున్నా, మిగిలిపోయే ఉండేవి కబుర్లు. అలాటిది ఈ వేళ....?'

నిజమే–

రేణుక ఎంత మంచి రోజును గుర్తు చేసింది!

నిజమే, రేణుకే అన్నట్లు అవన్నీ బతికిన్న రోజులు!!

అప్పుడు పొగడచెట్టుక్రింద మాట్లాడుతోంటే, కబుర్లు తరిగేవీ కావు, అరిగేవీ కావు. ఎంత మాట్లాడినా మరొక్క జీవిత కాలానికి సరిపోయే టన్ని కబుర్లు మిగిలే ఉండేవి. ఇవేళ–అదే రేణుక నా ఎదురుగ ఉంటే నోట్లోంచి ఒక పదమైనా వెలికి రావటం లేదు.

అంతా ఒకటే కారణం—ఆవేళ రేణుక నా జీవితానికి దీపం అవుతుందనుకున్నా. ఈ వేళ 'కాదు' అని తెలిసిపోయింది. దీపం కాకపోయినా కనీసం చీకటి అవకూడదనుకున్నా. కానీ రేణుక లేక నా జీవితం చీకటే అయిపోయింది.

'మాట్లాడవేం?'

'ఏం మాట్లాడను?–నువ్వే చెప్పు ఏదైనా'

'సర్లే ... పోనీ ఒకటడగనా?'

'అడుగు'

'నీ పెళ్ళెప్పుడు బావా?' నవ్వుతూ అడిగింది రేణుక.

ఏం చెప్పను? ఈ ప్రశ్నకు జవాబు నాకు నిజంగ తెలీదు. తెలీదని చెప్తే రేణుక నవ్వేస్తుంది.

'ఏమో నీ అంత అందగత్తె, నీ అంత సుగణవతే ఇంకొక రెవరైనా దొరికేంతవరకు ఇంతే, ఇదే బ్రహ్మచర్యం మరి!'

'నిజంగ నా అంత సుగణవతీ, నా అంత అందగత్తె దొరకకే పెళ్ళి చేసుకోలేదా?'

నవ్వాను సమాధానం చెప్పలేక.

'అదిగో, అదే వద్దన్నా మాటలలో చెప్పలేక అలా తేల్చేస్తే ఎలా? .. అయినా బావా, నా వల్ల సుఖపడి ఉండేవాడివనేనా నీ ఊహ?'

సంభాషణ ఇప్పటికి నాకు కావాల్సిన చోటుకు చేరింది. ఇది గాడి తప్పకుండ చూసుకోవాల్సిన బాధ్యత నాది.

'ఆ, అనే నా ఊహ'

'కానీ, నేనలా అనుకోను, అనుకోలేదు కూడా! పదిమంది పెద్దల ఆశీర్వాదం లేకపోతే కష్టమే ననుకున్నా....'

'అంటే?'

అంటే....ఏముందీ, కనీసం పదిమంది పెద్దలూ ఆశీర్వదించక పోయినా, శపించకూడదనుకున్నా. కానీ ఆ రోజున అదే జరిగింది. అందుకే భయపడ్డా'

నవ్వుకొన్నాను నేను–నిజంగ అది నవ్వుకాదు; ఏడ్వవలసిన సమయం అది. ఏడ్వలేక నవ్వేనవ్వు అది.

'భయపడినట్లు నాకైనా చెప్పాలిగా?'

'ఈ రోజు చెబుతున్నాగా!'

'కానీ ఈరోజు ఈ సంజాయిషీ నా ఖక్కర్లేదు'

'పోనీ నా కోసమే చెబుతున్నాననుకో! చూస్తూ చూస్తూ ఏ అల్పాయుష్యుడికీ తన కూతుర్ని ఇవ్వడుగదా! ఏ తండ్రైనా! వాళ్ళంతా నా కోసం భయపడ్డారు. నేను మాత్రం నీ కోసం, నీ మంచికోసం....'

'నా మంచికోసమే?' హఠాత్తుగ అడిగాను నేను.

'ఔను నీ మంచికోసమే? నా మెడలో తాళి కట్టేవాడు నీవే అయితే నా జాతకం ప్రభావంకూడ ఉంటుంది గదా నీమీద! బహుశా అందుకే నీకు అల్పాయువు అన్నారేమో!–నీ జీవితంలోంచి తప్పుకుంటే....'

'నువ్వొత్త ఫూల్‌వే....'

'కాదనను—ఎందు కంటున్నావు? ఔననీ ఎందుకంటున్నాననీ నవ్వకు–

'ఒకర్ని పెళ్లాడినంత మాత్రాన జరగాల్సింది జరగకపోదు, పెళ్ళాడటం మానేసినంత మాత్రాన అది మారనూ మారదు....'

'పోనీ అలాగే అనుకో, నాది మూఢనమ్మకమే! నా వల్ల నీ స్టార్స్ మారతాయనుకోటం తప్పేనేమోగానీ, నువ్వు కలకాలం బతకా లనేది నా కోరిక'

'కానీ, నేనలా అనుకోను, జీవితంలో ప్రతికేది క్షణకాలం అయినా తృప్తిగా బతికి, హాయిగా చద్దామనుకొన్నాను. నాకు ఆ అవ కాశం నువ్విచ్చావుగావు....'

'కానీ క్షణకాలం జీవితంలో అష్టయిశ్వర్యాలు అనుభవించి, ఆ తర్వాత అంతా ఏడ్వగలిగే స్తోమత నాకు లేదు బావా! బావతో క్షణాలు గడిపి, తర్వాత జీవితం అంతా చీకట్లో ఉంటావా? లేకపోతే బావకు దూరంగ కలకాలం బావను చూసుకొంటావా–అంటే దూరంగానే ఉంటా ననే దాన్ని నేను'.

ఇదంతా సోది. ఇంకోవిధంగా చెప్పాలంటే వేదాంతం ఈ విధమైన చర్చకు అంతే వుండదు—విసుగెత్తింది నాకు. 'పోనీ రెడ్డూ. ఇదంతా అనవసరం ఇప్పుడు;'

'నిజమే-ఒకటి చెప్పనీ నన్ను-ఆరోజు నీతో వస్తానన్న రోజున ఇంట్లో చెప్పే బయలుదేరుదామనుకున్నాను. కానీ నా జీవితం నీతోనే గడపాలని నిశ్చయించుకొన్నానని చెప్పేసరికి పదిమంది పది రకాలుగ అన్నారు బావా! ఇంతకన్నా ఇంకేం చెప్పను? నే కోరుకొన్నవి ఆశీర్వాదాలు బావా, శాపనార్థాలు కావు!! అందరి శాపనార్థాలు నెత్తిన వేసుకొని నీతో నేనేవిధంగా కాలం గడుపుతానో నాకే భయం వేసింది. అందుకే నేనే రాలేక పోయాను. ఇన్నాళ్లకు అవకాశం వచ్చింది. మనసులోమాట చెప్పుకోటానికి! నన్ను అర్థం చేసుకో బావా!'

రేణుక కేసి చూశాను. అమె కన్నులలోంచి నీరు కారిపోతోంది. నాకు చాల బాధగ ఉంది. ఇంతబేలగా ఎలా మారి పోయింది? ఏమీ మాట్లాడలేదు నేను.

చాలాసేపు తర్వాత అన్నాను నేను-'రేణూ!-'

రేణుక తలెత్తింది ఏమిటన్నట్లు.

'ఇంతకీ మీవార్ని చూపించనే లేదు"

పైట కొంగుతో కన్నీరు తుడుచుకుంది గద్గదంగా అంది రేణుక 'క్షమించుబావా! అమాటే మర్చిపోయాను. ఏదో సోది చెప్పుకోవటంలోనే గడిచి పోయింది టైమంతా! ...వారు హాస్పిటల్లో ఉన్నారు'

'హాస్పిటల్లోనా?' తెలిసిన విషయమే అయినా తెలీనట్లు ఆశ్చర్యాన్ని ప్రకటించాను.

'ఔను వారికి క్షయ'

అదిరిపడ్డాను నేను-క్షయ!!

'ఎప్పటినుంచి?'

'ఖచ్చితంగ చెప్పాలంటే పెళ్ళయిన నెల రోజులనుంచి!'

క్షణం ఆగి అడిగాను-ఇంట్లో అందరికి తేలుసా?'

'తెలియక పోవటానికి రహస్యమా బావా ఇది. తెలిసినా ఏం చేస్తారు ఎవరైనా!-నాఖర్మ అంతే!!

'ఐ యాం సారీ రేణూ!'

'పోనీ బావా, నువ్వుమాత్రం ఏం చేస్తావు? ఇష్టమైతే ఒకసారి చూసి వెడతావు! అంతేగా-మిగతాదంతా నేననుభవించాల్సిందే!'

నిజమే రేణుక భర్తను చూడాలి నా స్థానం పొందేదని కాదు. రోగిష్టి కాబట్టి సానుభూతికి అర్హుడు! భలేగా గుర్తు చేసింది!!

'ఛ, అదేమిటి రేణుకా! మేమంతా లేమూ!' మనస్ఫూర్తిగ అన్నాను నేను ఈ మాటను. కానీ మనస్ఫూర్తిగా నాకే అనిపించలేదు. రేణుకకు అనిపించినట్లులేదు అనుకుంటాను. క్షణంఆగి అడిగింది 'నిజంగానా?'

'ఆ, వారం రోజులలో నువ్వు తిరిగి వెళ్ళపోకపోతే అడుగు....

'నేను అదృష్టవంతురాలినే బావా అలాగే జరిగితే.... పోనీలే, రేపొస్తావా హాస్పిటల్‌కు వెడదాం!'

'ఆ తప్పకుండా వస్తాను'

'అయితే మూడింటికి ఇక్కడకేరా-నీకోసం వెయిట్ చేస్తుంటాను'

మూడింటికా? వీలుకాదు! ఆఫీసు? ఆమాట అనలేక పోయాను. రేణుక ఏమైనా బాధపడుతుందేమోనని.

'తప్పక రా బావా!.... వీలైతే నీ చేత్తో కొన్ని పూలు తీసుకురా. పువ్వులు, రేణుక ప్రాణం!

'తప్పకుండా తెస్తాను' బయటకు నడిచాను.

మనసంతా అల్లకల్లోలంగ ఉంది. డస్ట్ బిన్‌లో చెత్త కాగితాల లాగ రకరకాల ఆలోచనలు రేగుతున్నాయి.

*   *   *

మర్నాడు సాయంత్రం అయిదున్నరకు హోటల్ చేరుకున్నాను. అనుకున్నట్లుగనే రేణుక లేదు. హోటల్ బాయ్‌ని అడిగాను ఏమైందని. హాస్పిటల్‌కు వెళ్లిందనీ, నాకో చిన్నచీటీ ఇచ్చిందనీ చెప్పి, ఆ చీటీ అందించాడు. కాగితం అందుకొని చూశాను-హాస్పిటల్ అడ్రసు!

హాస్పిటల్‌కు బయలుదేరాను.

రేణుక పరిస్థితి తలచుకొంటే బాధగా ఉంది. నన్ను చేరాలనుకొంది. కానీ నాదీ అల్పాయువుట! పాపం చేరలేక పోయింది. పోనీ శాస్త్రోక్తంగానే మరోకతన్ని పెళ్లాండింది. ఆ పెళ్లికి ముందు జాతకాలు చూశారు, జాతకాలు కలిసాయి.

గ్రహాలస్థితిగతులను చూశారు-అవన్నీ సరిగనే ఉన్నాయి.

సుముహూర్తం పెట్టారు పెళ్లి జరిపించారు.

కానీ ఇదేమిటీ?

ఆ జాతకాలలో బహుశా క్షయ గురించి తెలిసుండదు! లేకపోతే తప్పకుండా ఇంకో సంబంధం.... కానీ గ్రహాలు జాతకాలూ-ఇవన్నీ రబ్బిష్! ఎవడికెంత జీవితం ఉందో తెలియదుగానీ. ఉన్నదాన్ని గడుపుకోవాలి, కోరుకున్నవి అందుకొని, అందినవి అనుభవించి... అంతేగానీ

హాస్పిటల్ రానే వచ్చింది-ఆలోచనలను కట్టిపెట్టి రేణుక ఇచ్చిన కాగితం చూశాను. అందులో ఇచ్చిన గుర్తుప్రకారం రేణుక భర్త ఉండే వార్డు చేరాను. రేణుక నేను వెళ్లేసరికి అతని పక్కన కూర్చొని ఉంది. బత్తాయిపండు ఒలుస్తూ. అతను... అతన్ని క్షయ బాగా తినేసింది. అతనిలో మిగిల్చింది ఒక్క ఎముకలు మాత్రమే! ఈ ఎముకలపోగుతో ఏవిధంగ గడుపుతోంది?

రేణుక నన్ను చూసి లేచి నిలబడింది 'రా బావా! ఇతనేనండీ మా రాజు బావ అని చెబుతుంటానే అతనే! బావా.... మావారు'

'నాపేరు మనోహరరావు, రండి, కూర్చోండి!'

కొంచెం భయం వేసింది. అయినా భయాన్ని మనసులో దాచుకొని అడుగులు ముందుకు వేశాను.

'మీ గురించి ఎంతో చెబుతుంది రేణు నాతో, మిమ్మల్ని కలుసుకోవాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా, ఇన్నాళ్ళకిలాపడింది అన్నాడతను కష్టంమీద.

వెంటనే దగ్గు తెర. చాలాసేపు ఖంగు ఖంగుమని దగ్గి చివరికింత రక్తం కక్కాడు. రేణుక గుడ్డతో అతని నోటిని తుడిచింది. మనిషి బాగా అలిసిపోయాడు. బాగా దీర్ఘంగా గాలి పీల్చి, రేణుకను దగ్గరగా రమ్మని పిలిచి అన్నాడు-'వెళ్లి .... కాఫీ'

'రేణుక కదిలింది. రేణుక వెళ్లేంత వరకు అలాగే చూసి తర్వాత అన్నాడు'మీరు చాల అదృష్టవంతులు....'

ఆశ్చర్యపోయాను—'అదేం?'

'మీకూ, రేణుకకూ పెళ్లి తప్పిపోయిన దటగా'

మాన్పడిపోయాను నేను. తమాయించుకొని అన్నాను—'పెళ్లి తప్పి పోవటం కాదు, జాతకాలు సరిపడలేదు'

'అందుకే మీరదృష్టవంతులంటున్నది. అల్పాయుష్షు అని మిమ్మల్ని వదిలేశారు. ఇపుడు నాకీగతి పట్టింది. తప్పు బహాశా మీలోనూ ఉండి ఉండదు. మీ జాతకాలలోనూ ఉండిఉండదు, రేణుక భర్త ఎవరైనా అల్పాయుష్షే అయేవాడేమో!'

గుండె ఆగిపోయిందనిపించింది. రేణుక లేకపోవడం ఎంత అదృష్టం! రేణుకే ఈ మాటలు వింటే ఆత్మహత్య అయినా తలపెట్టి ఉండేది. అయినా ఇంత అమానుషమైన ఊహ ఇతనిలో ఎలా కలిగింది? అతనంటే అసహ్యం వేసింది.

'మీ గురించి రేణు చెప్పినపుడనుకొన్నా మిమ్మల్ని చూస్తే బాగుండునని! ఎన్నాళ్లకు.... దగ్గుతెర—రక్తం—భయం.

ఆయాసం—రొప్పు అసహ్యం.

ఇద్దరం తేరుకున్నాము. 'ఈ వేళ ఇలా ఉన్నాగాని, నేను మా కాలేజీలో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్! నమ్మండి... రేణుక ఖర్మగాక పోతే, నాకేమిటండీ, ఇది!'

నిజమే—ఇది రేణుక చేసుకున్న పాపం! లేకపోతే వీడిచేతిలో పడటమేమిటి? పువ్వులాంటి జీవితం.... అన్నట్టు రేణుక పూలు తెమ్మంది. మరోసారి మర్చిపోయాను. రేణుక అడుగుతుంది. మర్చిపోయానని చెప్పాలి.... ఛ!

'ఏమిటి ఆలోచిస్తున్నారు?'

'ఊఁ.... రేణుక పూలు తెమ్మంది నన్ను'

నీరసంగ నవ్వాడు. ఆ కళ్లలోని ప్రాణాలు ఆ నవ్వుతోనే ఆరి పోతాయనిపించింది' పూలంటే రేణూకీ ప్రాణం. మీరు తెచ్చి ఇవ్వాల్సింది. ఇంకెన్నాళ్లో పెట్టుకోలేదు'

ఛీ ఇదేం మనిషి! మనసునిండా అసహ్యం పేరుకుంది. ఈ దవుర్భాగ్యుడికోసం కాకపోయినా, ఆ దేవతకోసం తేవాలి... తప్పదు. రేపు మర్చిపోతే నన్ను నేనే క్షమించుకోగూడదు.

ఆ తర్వాత అతనెన్నో మాట్లాడాడు సందర్భ ప్రసక్తులు, అసందర్భ ప్రేలాపనలు దురదృష్టవంతుడు.... రేణుక అంతటి దేవత అతని జీవితంలో ప్రవేశించాక కూడ అతని జీవితంలో దురదృష్టం మిగిలి పోయింది. అతనేం మాట్లాడినా వినిపించుకోలేదు, రేణుక వచ్చేంతవరకు.

రేణుకవచ్చి కాఫీ ఇచ్చాక, బయలు దేరాను. నన్ను సాగనంపడానికి వచ్చిన రేణుకతో 'నీ భర్తకు నీవంటే ఉన్న భావం ఇది' అని ఎలా చెప్పాలో అర్థంగాలేదు, చెప్పలేదు.

వెనక్కు తిరిగి వెళ్లేటప్పుడు అంది రేణుక-'బావా మీరంతా ఉన్నారనే ధైర్యం ఒక్కటే ఉంది నాకిపుడు' కంఠంలో జీర కనబడు తోంది. కళ్లల్లో దైన్యం తొణికిసలాడుతోంది.

క్షణం ఆగి అన్నాను నేను-'పూలు మర్చిపోయా రేణూ-రేపు తప్పకుండా తెస్తా'

అంతటి దుఃఖంలోను నవ్వింది-నా మనసు తేలికపడింది. ఆ దౌర్భాగ్యుణ్ణి చూడడానికి కాకపోయినా తప్పక వెళ్లాలని నిర్ణయించు కొన్నాను.

*          *          *

మర్నాడు బహు జాగ్రత్తగా గుర్తుపెట్టుకొని మల్లెపూలు కొన్నాను. పొట్లం చేత బట్టుకొని బయలుదేరాను.

మనోహరరావు ఉండే వార్డు దగ్గర అంతా నిశ్శబ్దంగ ఉంది. భయం భయంగ అడుగు వేశాను. మనోహరరావు మరణించి ఎంతోసేపు కాలేదు. ఆ కళ్లు గాజుకళ్లలా మెరుస్తున్నాయి. అతని పాదాలచెంత రేణుక పడి ఉంది. చుట్టు పక్కల ఇద్దరు ముగ్గురు పేషెంట్లు ఇటే చూస్తున్నారు. తలెత్తింది రేణుక ఆమె కళ్లంతా నీళ్ళు. నీళ్లల్లో కళ్లు.

లేచి నిలబడింది రేణుక. చేతిలో పూల పొట్లం అందుకొంది. పూలా బావా! భోరున ఏడ్చేసింది. పూలపొట్లం కింద పడిపోయింది.

పూలన్నీ నేలమీద పడిపోయాయి.

రేణుక నా గుండెలమీద ఏడుస్తూనే ఉంది.

(ఆంధ్ర సచిత్రవార పత్రిక 3-9-71).